నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
13 | హైదరాబాద్, మంగళవారం 19 మార్చి 2024 | HYDERABAD

కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ కార్పొరేటర్ నిహారిక, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్

సిటీబ్యూరో/మేడ్చల్: నగరంలో సోమవారం తొలి రోజు పదో తరగతి పరీక్ష సోమవారం సజావుగా జరిగింది. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా 72,877 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఖైరతాబాద్‌లోని నిర్మల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తనిఖీ చేశారు. మేడ్చల్ జిల్లాలో 46,683, రంగారెడ్డి జిల్లాలో 50,790 మంది పరీక్ష రాసినట్లు అధికారులు వెల్లడించారు.

భూ కబ్జాదారులకు
మేయర్ పదవి అప్పగిస్తారా?

అసలైన కాంగ్రెస్‌వాదులకు అన్యాయం చేస్తారా

జవహర్‌నగర్‌లో కాంగ్రెస్ నేతల నిరసన

జవహర్‌నగర్, మార్చి 18: భూ కబ్జాలకు పాల్పడే వారికి మేయర్ పదవి అప్పగించారంటూ.. సోమవారం కాంగ్రెస్‌కు చెందిన కార్పొరేటర్ నిహారిక గౌడ్, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్ జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఇతర నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు కొల్లగొట్టడంలో ఆరితేరిన వారు అక్రమంగా సంపాదించిన ఆస్తులను కాపాడుకునేందుకే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ డబ్బుల్కోళ్లకే ప్రాధాన్యం ఇస్తూ..అసలైన కాంగ్రెస్‌వాదులకు అన్యాయం చేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, కార్పొరేషన్ గేటు ఎదుట నిరసన తెలిపిన అనంతరం వారు అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఎదుట దీక్షను ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ పెద్దలు సమాధానం చెప్పేవరకు తాము దీక్ష విరమించమని స్పష్టం చేశారు. అయితే, సాయంత్రం మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్ వచ్చి నిహారిక, శంకర్ గౌడ్‌తో మాట్లాడి దీక్ష విరమింపజేయించారు.

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దంటూ.. ఇటీవల గాంధీ భవన్ ఎదుట నిరసన తెలిపిన కాంగ్రెస్ కార్పొరేటర్ విజయారెడ్డి అనుచరులు

పీజేఆర్ ఆనవాళ్లు లేకుండా!

ఎన్నికలకు ముందు కొడుకు విష్ణుకు మొండిచెయ్యి

అధికారంలోకి రాగానే దానంతో కుమార్తెకు చెక్

కాంగ్రెస్ శ్వాసగా బతికిన పీజేఆర్‌కు హస్తం పార్టీ ధోకా

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 18 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమే శ్వాసగా బతికిన దివంగత తెలంగాణ నేత పి. జనార్దన్‌రెడ్డిని ఇప్పటికీ అభిమానించే వారిలో కాంగ్రెస్ కార్యకర్తలే కాదు.. సాధారణ ప్రజలు కూడా గణనీయంగా ఉంటారు. అంతెందుకు... సీఎం రేవంత్‌రెడ్డితో సహా ఆ పార్టీ నేతలు సైతం పీజేఆర్ తెలంగాణ పోరాట పటిమను తమకు అనుకూలంగా చెప్పుకుంటూనే ఉన్నారు. కానీ అలాంటి నేత వారసులకు మాత్రం హస్తం పార్టీ మోసం చేస్తున్నది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పీజేఆర్ కుమారుడిని పొగబెట్టి బయటికి పంపిన ఆ పార్టీ నేతలు.. ఇప్పుడు ఆయన కుమార్తె, ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి విజయారెడ్డికి దానం నాగేందర్ రూపంలో చెక్ పెట్టారు. పీజేఆర్ విషయంలో నోటితో నవ్వుతూ.. నొసటితో వెక్కిరిస్తున్న ఆ పార్టీ తీరు పట్ల సొంత శ్రేణులే గుర్రుగా ఉన్నారు.

కాంగ్రెస్ కండువా వీడని పీజేఆర్..

ఉమ్మడి రాష్ట్రంలో 2009 వరకు దేశంలోనే అతి పెద్ద శాసనసభ నియోజకవర్గంగా వెలుగొందిన ఖైరతాబాద్ నియోజకవర్గమంటేనే పి. జనార్దన్‌రెడ్డి (పీజేఆర్) పేరు గుర్తుకువస్తుంది. 2007లో పీజేఆర్ గుండెపోటుతో అకస్మాత్తుగా చనిపోయారు. బతికి ఉన్నంత వరకు కాంగ్రెస్ కండువా వీడని పీజేఆర్... తెలంగాణ ప్రయోజనాల కోసం సొంత పార్టీ ముఖ్యమంత్రిపైనే తిరుగుబావుటా ఎగురవేసిన నికార్సయిన రాజకీయ నాయకుడు. అందుకే ఆయన మరణించి దశాబ్దంన్నర అవుతున్నా.. నగర రాజకీయాల్లో అన్ని పార్టీలు సైతం పీజేఆర్‌ను కీర్తిస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలకు ప్రతిఫలంగా పీజేఆర్ వారసులకు సముచిత స్థానం కల్పించాల్సిన కాంగ్రెస్ పార్టీ మాత్రం అడుగడుగునా వారిని రాజకీయంగా అణచివేతకు గురి చేస్తున్నారనే ఆవేదన పీజేఆర్ అభిమానులను కలచివేస్తున్నది. పీజేఆర్ మరణం తర్వాత వచ్చిన ఉప ఎన్నికలో ఆయన తనయుడు పి.విష్ణువర్ధన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2009 సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గాల పునర్విభజన జరగడంతో విష్ణువర్ధన్‌రెడ్డి ఖైరతాబాద్‌లో భాగంగా ఏర్పడిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి, గెలుపొందారు. ఇక... 2014, 2018 ఎన్నికల్లో అదే జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విష్ణువర్ధన్‌రెడ్డి ఓటమి చెందారు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీనే నమ్ముకొని ఉన్నారు. అయితే గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విష్ణుకు టికెట్ రాలేదు. దీంతో విష్ణు తీవ్ర మనో వేదనకు గురి కాగా... పీజేఆర్ తెలంగాణకు చేసిన సేవల్ని గుర్తు చేసుకొని బీఆర్ఎస్ పార్టీ ఆయన్ని పార్టీలోకి ఆహ్వానించి, సముచిత స్థానాన్ని కల్పించింది. ఇలా పీజేఆర్ వారసుడికి కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా తీవ్ర అన్యాయం చేసింది.

ఇప్పుడు కుమార్తె వంతు..

పీజేఆర్ కుమార్తె విజయారెడ్డి చాలాకాలంగా ఖైరతాబాద్ నియోజకవర్గాన్ని నమ్ముకుని ఉన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్‌ను కూడా ముందుకు నడిపించడంతో ఎట్టకేలకు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆమెకు టికెట్ ఇవ్వగా, ఓటమి పాలయ్యారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు ఓడిపోయిన అసెంబ్లీ స్థానాల్లో పార్టీ అభ్యర్థులే నియోజకవర్గ ఇన్‌చార్జీలుగా కొనసాగుతున్నట్లుగా ఇక్కడ కూడా విజయారెడ్డి ఇన్‌చార్జిగా ఉన్నారు. కానీ అనూహ్యంగా బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్‌ను కాంగ్రెస్‌లోకి తీసుకోవడంతో ఇప్పుడు ఆమెకు చెక్ పెట్టినట్లేనని పీజేఆర్ అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా పీజేఆర్ శిష్యుడైన దానం నాగేందర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పటి నుంచి పీజేఆర్ కుటుంబానికి వ్యతిరేకంగానే వ్యవహరిస్తున్నారనేది బహిరంగ రహస్యం. ఈ క్రమంలో ప్రస్తుతం ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో విజయారెడ్డి పరిస్థితి ఏమిటనే ఆవేదన సాధారణ కార్యకర్తల్లో వ్యక్తమవుతున్నది. ఎన్నికలకు ముందు పీజేఆర్ కుమారుడికి పొగబెట్టిన కాంగ్రెస్ పార్టీ నేతలు.. ఇప్పుడు ఎన్నికల తర్వాత కుమార్తెకు రాజకీయంగా క్లిష్టమైన పరిస్థితులు కల్పిస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది. ఇలా మొత్తంగా నగర రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన పీజేఆర్ ఆనవాళ్లు లేకుండా ఆయన వారసులకు చెక్ పెట్టే కుట్ర కాంగ్రెస్ పార్టీ నుంచే జరుగుతున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

వీధి కుక్కల కోసం 4900 వాటర్ బౌల్స్

సిటీబ్యూరో, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో 88.5 శాతం వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ చేసినట్లు సోమవారం బల్దియా అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరంలో 59,745 వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు నిర్వహించామన్నారు. వీధి కుక్కల నియంత్రణకు హై లెవల్ కమిటీ సూచనల ప్రకారం చర్యలు చేపడుతున్నామని, హోటళ్లు, రెస్టారెంట్లు, ఫంక్షన్‌హాళ్లు, మాంసాహార దుకాణాలు, వైద్యశాలలు, హాస్టల్ నిర్వాహకులకు వ్యర్థాల పారబోతపై నోటీసులు జారీ చేశామని, 3263 మందికి నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. వేసవిలో వీధి కుక్కల సంరక్షణకు ఎన్జీవో సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని, 4900 వాటర్ బౌల్స్‌ను వీధి కుక్కల కోసం ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. ఆదివారం మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లి ఆర్రాన్‌పల్లి జరిగిన కుక్కకాటు ఘటన జీహెచ్ఎంసీ పరిధిలోకి రాదని అధికారులు స్పష్టం చేశారు.

జంతుప్రేమ ప్రాణం తీసింది

బంజారాహిల్స్, మార్చి 18 : జంతువులపై ప్రేమతో వాటికి స్నానం చేయించేందుకు నీటిలో దిగిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు మునిగి చనిపోయాడు. ఫిలింనగర్ పోలీసుల కథనం ప్రకారం...బీజేఆర్‌నగర్ బస్తీలో నివాసముండే గుండు శ్రీను, స్వప్న దంపతుల కుమారుడు గుండు పవన్ (19) ఆదివారం అతడి స్నేహితుడు శ్రీకాంత్‌కు చెందిన గొర్రె, పొట్టేళ్లను తీసుకొని వాటికి స్నానం చేయించేందుకు మరో ఇద్దరు స్నేహితులు నితిన్, వెంకటిలతో కలిసి రాక్ గార్డెన్ చెరువుకు వచ్చాడు. గొర్రె, పొట్టేళ్లను ఒడ్డున కట్టేసి స్నేహితులతో కలిసి స్నానం చేసేందుకు చెరువులో దిగాడు. ఈత రాకపోవడంతో నితిన్, వెంకీలు ఇద్దరూ నీళ్లలో మునిగిపోతుండగా స్థానికులు రక్షించారు. పవన్ మాత్రం గల్లంతయ్యాడు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వెంటనే నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌ను రంగంలోకి దింపారు. సోమవారం మధ్యాహ్నం పవన్ మృతదేహం లభించింది.

మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి గదను ఎత్తిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎల్బీనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ తదితరులు

బీఆర్ఎస్‌ను గెలిపించుకుందాం

మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

ఎల్బీనగర్: బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కోరారు. సోమవారం కర్మన్‌ఘాట్ కొత్తకాపు యాదవరెడ్డి గార్డెన్స్‌లో జరిగిన ఎల్బీనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశంలో ఆయన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచపటంలో నిలిపిన ఘనత, ఐటీ అభివృద్ధికి కారణం కేసీఆరేనన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. తనకు పోటీ చేసే అవకాశం కల్పించిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. మల్కాజిగిరిలో బీఆర్ఎస్‌దే విజయమన్నారు. ఎంపీగా రాగిడి లక్ష్మారెడ్డి విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సామ తిరుమల్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, జీవీ సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబితాఇంద్రారెడ్డి నివాసంలో సమావేశమైన ఎమ్మెల్యేలు గాంధీ, ప్రకాశ్‌గౌడ్, కాలే యాదయ్య, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, యెగ్గే మల్లేశం, దయానంద్‌గుప్తా తదితరులు

కాసాని గెలుపే లక్ష్యం

ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ఆర్కేపురం: చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పని చేద్దామని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం శ్రీ నగర్ కాలనీలోని తన నివాసంలో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా ఈనెల 24 ఉదయం 10గంటలకు మీర్‌పేట్‌లోని ఎస్‌వై ఆర్ గార్డెన్స్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ జడ్పీ చైర్మన్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్లు, అన్ని డివిజన్ల అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొనాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు అరెకపుడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, కాలే యాదయ్య, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, యెగ్గే మల్లేశం, దయానంద్‌గుప్తా, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, మహేశ్వర్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, యువ నేత కార్తిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం అధిగమించేనా?

ఆస్తిపన్ను వసూళ్లపై 'ఎన్నికల' పిడుగు

ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న వేళ.. లక్ష్యం దాటడం కష్టమే

సిటీబ్యూరో, మార్చి 18 (నమస్తే తెలంగాణ): ఆస్తిపన్ను వసూళ్లపై పార్లమెంట్ ఎన్నికల కోడ్ ప్రభావం చూపనున్నది. ఇప్పటికే గతేడాది అసెంబ్లీ ఎన్నికలు, కొత్త సర్కారులో ప్రజాపాలన సందర్భంగా అధికారులు సంబంధిత విధుల్లో నిమగ్నం కావడంతో ఆస్తిపన్ను కలెక్షన్లు ఆశించిన స్థాయిలో రాలేదు. ఈ నేపథ్యంలోనే 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2100 కోట్ల నిర్దేశిత లక్ష్యంలో ఇప్పటి వరకు కేవలం రూ. 1488.47 కోట్లు మాత్రమే వసూలైంది. రాబోయే 13 రోజుల్లో ఆర్థిక సంవత్సరం గడువు ముగుస్తుండటం.. 70.88 శాతం మాత్రమే వసూలు కావడం..అందులో పార్లమెంట్ ఎన్నికల విధుల్లో చాలా మంది అధికారులు, సిబ్బంది ఉండటంతో నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించడం జీహెచ్ఎంసీకి కత్తిమీద సాములా మారిందనే చెప్పవచ్చు. వాస్తవంగా ఈ నెల మొదటి వారంలోనే ఆస్తిపన్ను బకాయిదారులపై బల్దియా బంపర్ ఆఫర్ ప్రకటించింది. బకాయిలపై 90శాతం వడ్డీ రాయితీ అందిస్తూ వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఓటీఎస్ ద్వారా దాదాపు రూ.500 కోట్ల మేర ఆదాయం రావొచ్చని అధికారులు అంచనా వేశారు. కానీ అంచనాలు తలకిందులయ్యాయి. 18 రోజుల్లో రూ.55 కోట్ల మేర మాత్రమే ఓటీఎస్ కలెక్షన్లు వచ్చాయి. ఆస్తిపన్ను వసూళ్లలో వేగం పెంచడం, ఓటీఎస్, ప్రతి ఆదివారం ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కార వేదికల నిర్వహణ పర్యవేక్షణకు సర్కిల్ వారీగా ఐఏఎస్‌ల నుంచి ఉన్నతాధికారుల వరకు ప్రత్యేక అధికారులుగా నియమించినప్పటికీ ఫలితాలు మాత్రం పెద్దగా లేవనే చెప్పాలి. ఈ సమయంలోనే ఈ నెలలో రూ.685.85కోట్ల టార్గెట్‌లో కేవలం రూ. 76కోట్ల మేర మాత్రమే వసూలయ్యాయి. రాబోయే 13 రోజుల్లో 22 శాతం వసూళ్లను రాబట్టడం, అందులో ఎన్నికల విధులు, వరుస సెలవులు వస్తుండడం అధికారులకు సవాల్‌గా మారింది. మొత్తంగా ఈ ఏడాది నిర్దేశిత లక్ష్యం అధిగమించడం కష్ట సాధ్యమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి.

2023-24 ఆర్థిక సంవత్సర ఆస్తిపన్ను వివరాలు

జోన్	నిర్దేశిత లక్ష్యం(రూ.కోట్లలో)	వసూళ్లు
ఎల్బీనగర్	320.94	207.11
చార్మినార్	150.91	108.56
ఖైరతాబాద్	546.07	373.02
శేరిలింగంపల్లి	447.28	342.45
కూకట్‌పల్లి	346.95	258.05
సికింద్రాబాద్	287.85	199.27

మాది కాదు.. మీదే బాధ్యత!

అనుమతులే మా వంతు..

అనధికార నిర్మాణాలను అరికట్టడం మీ బాధ్యతే

స్థానిక సంస్థలకు హెచ్ఎండీఏ లేఖలు

అక్రమ నిర్మాణాలపై చేతులెత్తేసిన వైనం

అధికారుల మధ్య కరువైన సమన్వయం

సిటీబ్యూరో, మార్చి 18 (నమస్తే తెలంగాణ): 'తాంబూలాలిచ్చేశాం.. తన్నుకు చావండి'అన్నట్లు వ్యవహరిస్తోంది హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ. అక్రమ నిర్మాణాలు, లేఅవుట్ల విషయంలో చేతులెత్తేస్తోంది. భవన నిర్మాణాలకు, లేఅవుట్లకు అనుమతులివ్వడమే కాదు... వాటిని సక్రమంగా హెచ్ఎండీఏ నిబంధనలకు అనుగుణంగా నిర్మిస్తున్నారో.. లేదో పర్యవేక్షిస్తూ అనధికార నిర్మాణాలను అడ్డుకోవాల్సిన పూర్తి బాధ్యత హెచ్ఎండీఏపైనే ఉన్నది. అయినా, ఈ విషయంలో అధికారులు హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న లోకల్ బాడీస్ (స్థానిక సంస్థలు)కు పూర్తి స్థాయిలో డెలిగేషన్ పవర్స్ ఇచ్చేశామంటూ పాలసీ విధానాలను చెబుతున్నారే తప్ప, అక్రమాల జోలికి వెళ్లడం లేదు. ఫలితంగా క్షేత్ర స్థాయిలో అక్రమ నిర్మాణాలే కాదు.. లేఅవుట్లు సైతం యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

లేఖ రాసినా..

బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీ పరిధిలో ఒక కాలనీలో చేపడుతున్న జీ ప్లస్ 5 అపార్టుమెంట్ నిర్మాణానికి హెచ్ఎండీఏ పరిధిలోని శంకర్‌పల్లి జోన్ ప్లానింగ్ విభాగం అధికారులు అనుమతులిచ్చారు. దీనిపై స్థానికులు హెచ్ఎండీఏ ఇచ్చిన అనుమతులకు అనుగుణంగా నిర్మాణం చేపట్టడం లేదని, సెట్ బ్యాక్స్ సరిగా లేకుండా నిర్మాణం చేస్తున్నారని ఫిర్యాదు చేస్తే దాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి అడ్డుకోవాల్సిన హెచ్ఎండీఏ అధికారులు.. కేవలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు లేఖ రాసి చేతులు దులుపుకొన్నారు. ఈ లేఖపైనా స్థానిక సంస్థ అధికారులు సైతం చర్యలు తీసుకోలేదు. హెచ్ఎండీఏ అనుమతిచ్చిన ప్లాన్ ప్రకారం కాకుండా చుట్టూ డీవియేషన్స్‌తో చేపట్టిన నిర్మాణాన్ని మాత్రం ఇప్పటికీ అడ్డుకోలేదు. దీనిపై కాలనీ వాసులు హెచ్ఎండీఏ కార్యాలయం, స్థానిక సంస్థ బీజేఎంసీ కార్యాలయం చుట్టూ అనేక సార్లు తిరిగినా ఫలితం లేకుండా పోయింది. ఇదిలా ఉంటే అనుమతుల ప్రకారం భవనాల నిర్మాణాలు జరగడం లేదని ఫిర్యాదు చేస్తే మాత్రం హెచ్ఎండీఏ చట్టం-2008 సెక్షన్ 23(2) ప్రకారం డెలిగేషన్ పవర్స్‌ను స్థానిక సంస్థలకు ఇచ్చామని, దానికి సంబంధించిన నంబరు (లెటర్ నంబరు 803/పాలసీ/పీఎల్జీ/హెచ్ఎండీఏ/2020 (19-03-2020)న జారీ చేసిన లేఖను ఫిర్యాదు దారులకు చూపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంపై సమాచార హక్కు చట్ట ప్రకారం హెచ్ఎండీఏను వివరణ కోరినా అధికారులు ఇదే విషయాన్ని చెబుతున్నారే తప్ప, అక్రమ నిర్మాణాలు, లేఅవుట్ల విషయంలో చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ సంస్థల సమన్వయం కరువు..

హెచ్ఎండీఏ పరిధిలోని బాకారం గ్రామ రెవెన్యూ పరిధిలోని 8 ఎకరాల విస్తీర్ణంలో మొత్తం 12 విల్లాలను పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా కట్టారని, వాటిని కూల్చివేయాలంటూ.. కొందరు హెచ్ఎండీఏకు ఫిర్యాదు చేశారు. దానికి హెచ్ఎండీఏ అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీకి ఆదేశాలిచ్చారు. దీనికి గ్రామ పంచాయతీ అధికారులు కూల్చివేయడానికి పోలీస్ బలగాలు కావాలని హెచ్ఎండీఏకు, జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. ఇలా అక్రమ నిర్మాణాలను అడ్డుకునే విషయంలో తీవ్ర జాప్యం జరుగుతుండగా, ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయం కరువైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.